నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

కాలిక్కాచ్చేనా?

- నిర్విరామంగా సహాయక చర్యలు
- మూడ్రోజులైనా లభ్యంకాని ఆచూకీ
- రోజురోజుకూ సన్నగిల్లుతున్న ఆశలు
- 9 బృందాలతో విస్తృత గాలింపు
- పర్యవేక్షిస్తున్న మంత్రులు, అధికారులు
- ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఉత్కంఠ

ఆందోళనలో ఎస్ఎల్‌బీసీ కార్మికులు



దోమలపెంట శివారులోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 24: ఎల్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో అధికారులు, రెస్క్యూ టీమ్‌ల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మూడు రోజులైనా సహాయ చర్యలతో సమస్య కొలిక్కి రాలేదు. టన్నెల్‌లో ఇరుక్కున్న వారిని ఎలా తీసుకురావాలనే పరిశీలనలతోనే సరి పోయింది. ఇప్పటి వరకు టన్నెల్‌లో ఏ ఒక్కరి ఆచూకీ లభ్యం కాకపోవడంతో మిగతా కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజూ మంత్రులు, ఉన్నతాధికారులు వస్తూ పరిశీలిస్తున్నారే కానీ ఎలా తీసుకురావాలనే విషయంలో అంతర్మథనం ఏర్పడింది. ఇప్పటి వరకు ఎన్‌డీఎ స్ఎఫ్, ఎస్‌డీఎ స్ఎఫ్ బలగాలతోపాటు కేంద్ర, రాష్ట్ర విపత్తుల బృందాలు, ఆర్మీ, నేవీ, సింగరేణి కార్మికులతోపాటు, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం, జేపీ, నవయుగ కంపెనీలకు చెందిన ఉన్నతాధికారులు బృందం ఇప్పటి వరకు ఘటన జరిగినప్పటి నుంచి ఏడు సార్లు టన్నెల్‌లో తనిఖీ నిర్వహించినా ఫలితం లేకపోయింది. సోమవారం స్లీపర్ డాగ్‌ల సేవలను ఉపయోగించారు. గతంలో ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులో ఈ బృందాలు రెస్క్యూ ఆపరేషన్లను సమర్థవంతంగా నిర్వహించాయన్న ఉద్దేశంతో ఎల్ఎల్‌బీసీ వద్దకు తీసుకొచ్చారు. వీరితోపాటు 14మంది ర్యాట్(ర్యాట్ హోల్ టీమ్) మైనర్స్ సేవలను ఉపయోగించారు. టన్నెల్‌లో ఉన్నవారి ఆచూకీ తెలుసుకునేందుకు స్నీపర్ డాగ్స్‌ను వినియోగించారు. ఎక్కువ మొత్తంలో టన్నెల్‌లో నీటి ఊట పెరగడంతో లోకో బోగి టన్నెల్‌లోని 13.5 కిలోమీటర్ల పోయే అవకాశం ఉన్నప్పటికీ నీటి ఉధృతి పెరగడంతో సోమవారం మూడోవంతు వరకు టన్నెల్‌లోకి పోయివచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం బురద నీరు పెరిగిపోతుండడంతో ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేకపోతున్నామని రెస్క్యూ బృందాలు పేర్కొంటున్నాయి. నీటి ఉధృతి పెరిగిన కారణంగా స్నీపర్ డాగ్స్ లోపలికి వెళ్లలేక పోయాయని టన్నెల్‌లోకి వెళ్లిన బృందం సభ్యులు పేర్కొంటున్నారు. పైనుంచి రంధ్రం చేసి టన్నెల్ లోపలికి వెళ్లాలన్న (వర్టికల్ డ్రిల్లింగ్) ప్రతిపాదనను తోసిపుచ్చారు. విధిలేని పరిస్థితుల్లో గ్యాస్ కట్టింగ్ మిషన్లతో పనిచేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి టన్నెల్ ప్రాంతాన్ని పరిశీలించారు. సాయంత్రం జేపీ కంపెనీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని వెలికితీయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు వారు సజీవంగా ఉన్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఒక అధికారి మొబైల్ ఫోన్ రింగ్ అయ్యిందని, దాని ప్రకారంగా సిగ్నల్‌తో వారి లొకేషన్ గుర్తించామన్నారు.

టన్నెల్ వద్ద సహాయక చర్యల్లో పాల్గొన్న నేవీ టీం

పస్తులుంటున్నాం..

- జీతాల్లేక ఇండ్ల నుంచి పైసలు తెప్పించుకొని సరుకులు కొంటున్నాం
- బతకనికె వచ్చాం.. మావోళ్లను కోల్పోయాం
- టన్నెల్‌లో బురద తీయాలని కంపెనీ అధికారులు బెదిరిస్తుండ్రు
- ఇంత జరిగాక లోపలికి వెళ్లాలంటేనే భయమేస్తోంది
- మూడ్నెళ్ల జీతాలిస్తే మా ఊళ్లకు పోతాం
- ఎస్ఎల్‌బీసీ కార్మికుల ఆవేదన

అచ్చంపేట, ఫిబ్రవరి 24: మా కళ్లముందే మాతోటి కార్మికులను పోగొట్టుకొవాల్సి వచ్చింది. బతుకుదెరువు కోసం జార్ఖండ్ నుంచి కుటుంబాలను వదిలివచ్చాం. మా ముందే మాతోటి వాళ్లను వదులుకోవాల్సి వచ్చింది. లోపల భయంకరమైన పరిస్థితి ఉంది. టన్నెల్‌లో చిక్కుకున్న మా వాళ్లను బయటకు తేవడానికి అనేక రెస్క్యూ బృందాలు శ్రమిస్తున్నా నేటివరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఇలాంటి పరిస్థితిలో మమ్ములను వచ్చి టన్నెల్‌లో పనులు చేయడానికి రావాలని కంపెనీ అధికారులు రెండు రోజులుగా భయపెట్టిస్తున్నారు.. లోపల ఉన్న మావాళ్లను తలుచుకొని మేము బాధపడుతున్నాం. మళ్లీ మేము లోపలికి వెళ్లి పనిచేయగలమా?.. ఇప్పటి వరకు మేము పనిచేసిన మూడు నెలల వేతనాలు ఇవ్వలేదు. మాకు బియ్యం, సరుకులు తెచ్చి వంట చేసుకొని తిన డానికి డబ్బుల్లేక మా ఇండ్లకు ఫోన్లు చేసి పైసలు తెప్పించుకొని సరుకులు తెచ్చుకుంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అమ్రాబాద్ మండలం దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జేపీ, రాబిడ్స్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు తమ వేదన వెల్లిబుచ్చారు. సోమవారం టన్నెల్‌లో పనిచేస్తున్న కార్మికులను 'నమస్తే తెలంగాణ' పలకరించింది. వారు మొదటగా చెప్పడానికి భయపడ్డారు. తర్వాత వారితో మాట మాట కలుపగా.. వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, బాధలను వెళ్లగక్కారు. టన్నెల్ సమీపంలో ఒక షెడ్డువేసి అందులో ఉంచారు. అక్కడ మొత్తం 150మంది వరకు ఉంటున్నారు. షెడ్డులో అడ్డంగా రేకులు కట్టి ఒక రేకుల గదిలో 8నుంచి 10మంది వరకు ఉంటున్నారు. వాళ్లు నివాసముంటున్న షెడ్డును చూస్తే పశువుల పాకగా ఉన్నది. చిన్నగదిలో వంట చేసుకొని అక్కడే పడుకోవాలని గదిని చూపించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు పనిచేయక నిరూపయోగంగా మారాయి. నల్లాలు పని చేస్తలేవు. రేకులతో నిర్మించారు. రేకులన్నీ ఊడిపడ్డాయి. సిమెంటుతో చిన్న వాటర్ ట్యాంకు కట్టారు. ఆ నీళ్లనే తాగుతున్నారు. ట్యాంకును ఏళ్ల తరబడి శుభ్రం చేసిందిలేదు. కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఇదిలా ఉండగా.. అందరు టన్నెల్ దగ్గరికే వెళ్తున్నారు కాని.. మా కార్మికుల వద్దకు వచ్చి ప్రమాదం ఎలా జరిగింది, మా సమస్యలు ఏమిటని అడిగేవారు లేరు. మేము ఎవరి హైలో కలిసి మాగోడును చెప్పాలనుకున్నా మాకెవ్వరూ తెల్వదు. ఒక షిఫ్టులో 50మంది చొప్పున మూడు షిఫ్టుల్లో పనిచేస్తం. ఒక షిఫ్టులో 10గంటలు పనిచేయాల్సి ఉంటుంది. కంపెనీ అధికారులకు డబ్బులు అడిగితే ఇవ్వరు. పనిచేస్తే చేయండి లేకుంటే వెళ్లి పోండి అంటారు. పది గంటలు పనిచేస్తే 600 వరకు కూలీ వస్తోంది. తిండి కోసం పస్తులు ఉండాల్సి వస్తోంది. పనిచేసే క్రమంలో ఎలాంటి దెబ్బలు తగిలినా మా సొంత డబ్బులతోనే చికిత్స చేయించుకోవాలని కార్మికులు తమ బాధలను చెప్పుకొచ్చారు. కంపెనీ వారు అంబులెన్స్ ఇచ్చి పంపిస్తారు. దానికి డబ్బులు మేమే ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. మేమందరం పరేషాన్‌లో ఉన్నాం. భయపడుతున్నాం. లోపలికి ఎలా వెళ్తాం.. లోపల మట్టి ఉంది. మీరే తీయాలని కంపెనీ అధికారులు, మేనేజర్ వచ్చి ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. మేము పనిచేస్తున్న క్రమంలోనే మా ముందే పైనుంచి మట్టి కూలిపడింది. టన్నెల్‌లోకి పెద్దఎత్తున నీళ్లు వచ్చాయి. భారీగా మట్టి వచ్చేసింది. మేము మా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగులు తీసి బయట కొచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్ఎల్‌బీసీ కార్మికులు నివాసం ఉంటున్న షెడ్డు

నీళ్ల రంధ్రాలు పూడ్చడంతోనే ప్రమాదం

పైకప్పు నుంచి మధ్యమధ్యలో లూజ్‌మట్టి పడుతుంది. పైనుంచి రంధ్రాల గుండా నీటి లీకేజీ కొనసాగుతున్నది. అక్కడక్కడా ఏర్పడుతున్న లీకేజీలను పూడ్చుకుంటూ వెళ్తున్నాం. ఒక వద్ద పూడిస్తే మరో చోట లీకవుతుంది. కప్పు పైన నీళ్లు భారీగా వచ్చి చేరుతున్నట్లు అనిపించింది. నీళ్ల లీకేజీ రంధ్రాలు పూడ్చడంతో పైన ఉన్న నీళ్లు ఎటూ వెళ్లలేక ఒకేసారి నీటి ప్రవాహం పెరిగింది. ఆ రోజు రాత్రి టీబీఎం మిషన్ డ్రిల్లింగ్ చేసింది. ఉదయం వెళ్లి మిషన్ డ్రిల్లింగ్ చేసి మావాళ్లు ముందుకెళ్లి ఆరు రింగులు కూర్చోబెట్టారు. ఏడో రింగ్ కూర్చోబెట్టే పనిలో ఉండగా.. ప్రమాదం చోటు చేసుకున్నది. నీళ్ల రంధ్రాలు పూడ్చకుండా ఉండి ఉండే ఇంత పెద్ద ప్రమాదం జరిగేది కాదు.

- మకలియూత్, కార్మికుడు, జార్ఖండ్

ప్రవాహానికి టన్నెల్‌లో మిషనే వెనక్కొచ్చింది..

పైనుంచి భారీ నీటి ప్రవాహంతో పైకప్పు కూలింది. ఈ ప్రవాహానికి టన్నెల్‌లో రింగులు వేస్తున్న మిషన్ వెనక్కు వచ్చేసింది. టీబీఎం మిషన్ ముందుభాగంలో ఉంది. వెనుక భాగంలో చిక్కుకున్న ఎనిమిది మంది మిషన్‌తో సిమెంట్ రింగులు బిగించే పనిలో ఉండగా.. ఉన్నట్టుండి భారీ శబ్దంతో పైనుంచి కప్పు కూలిపడింది. సరిగ్గా అది వాళ్లున్న స్థలంలోనే కూలిపడిపోయింది. కూలిన వెంటనే టన్నెల్ నిండా నీళ్లు, బురద వచ్చేసింది. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఎవరికివారు ప్రాణాలు కాపాడుకున్నారు. ఆ ఎనిమిది మంది ఎక్కడికీ కదిలే పరిస్థితి లేదు. అక్కడే మట్టిలో మూసుకొని పోయి ఉంటారు. కూలిన ప్రవాహానికి మిషనే కొంతదూరం వచ్చేసింది. వాళ్లు అయితే ప్రాణాలతో ఉండరు. వాళ్లు టన్నెల్ లోపల టీబీఎం మిషన్ వెనుక భాగం, రింగులు ఫిటింగ్ చేసే మిషన్ మధ్యలో ఉంటారు. అక్కడికి వెళ్లాలంటే ఛాతిభాగం వరకు బురద ఉంది.

- రాజ్‌కుమార్‌సాహూ, కార్మికుడు, జార్ఖండ్

మూడ్నెళ్లుగా కూలి ఇస్తలేరు

నేను పదేండ్లుగా టన్నెల్‌లో పనిచేస్తున్నా. లోపల నీళ్లను బయటకు పంపే పైపులైన్ పనులు, ఇతర పనులు చేస్తా. జార్ఖండ్ నుంచి వచ్చా. నాకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నేను నెలరోజులు పనిచేస్తే రూ.16వేల నుంచి 18వేలు వస్తాయి. నేను ఖర్చులకు ఉంచుకొని కుటుంబానికి పంపిస్తా. అయితే చేసిన కూలీకి డబ్బులు ఇవ్వరు. గట్టిగా అడిగితే వెళ్లిపోండని అంటారు. ఇప్పుడు మూడు నెలలుగా డబ్బులు ఇవ్వలేదు. అడిగితే ఇప్పుడు డబ్బుల మాట తీయొద్దని అంటున్నారు. మేము ఏం తిని బతకాలి. మాకు పైసలు ఇచ్చేస్తే మా రాష్ట్రానికి వెళ్లిపోతాం. మాకు పైసలు ఇప్పించమని వేడుకుంటున్నం. మేము 150మంది వరకు షెడ్డులో ఉంటాం. ఒక షెడ్డు గదిలో పదిమంది వరకు ఉండాలి. వంట మాది మేమే చేసుకుంటాం. వంటల కోసం కట్టెలు ఉండవు. బాత్‌రూంలు సరిగ్గాలేవు. తలుపులు లేకుండా రేకులు ఊడిపోయాయి.

- బిలీప్‌కుమార్, కార్మికుడు

అధికారులను అడ్డుకుంటున్న కాట్రేవుపల్లికి చెందిన రైతులు

సర్వే ఆపుతారా..?

ఆత్మహత్య చేసుకోవాలా..?

- పెట్రోల్ బాటిల్‌తో కాట్రేవుపల్లి రైతు హెచ్చరిక
- సర్వే కోసం వచ్చిన అధికారుల అడ్డగింత
- చేసేది లేక పనులు నిలిపివేసిన తాసీల్దార్
- నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ పనులు నిలిపివేయాలని డిమాండ్

మక్తల్, ఫిబ్రవరి 24 : నారాయణపేట-కొడంగల్ ఎత్తి పోతల పథకం సర్వేకు రైతుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. నిత్యం పనులు చేసేందుకు అధికారులు రావడం.. తమ భూముల్లో అనుమతి లేకుండా సర్వే ఎలా కొనసాగిస్తారని రైతులు అడ్డుకుంటున్నారు. సోమవారం మక్తల్ మండలం కాట్రేవుపల్లి సర్వే కోసం వెళ్లిన అధికారులకు భంగపాటు తప్పలేదు. నారాయణపేట-కొడంగల్ ఎత్తి పోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నీటిపారుదల, రెవెన్యూ శాఖాధికారులు భూ సర్వే చేపట్టడానికి పోలీస్ బందోబస్తుతో రైతుల పొలాల్లోకి వెళ్లారు. విషయం తెలుసుకొన్న రైతులందరూ పెద్ద ఎత్తున చేరుకొని అడ్డుకున్నారు. అయినా వినని అధికారులు మీరు ఆందోళన చేసినా పనులు ఆగవని బెదిరించే యత్నం చేశారు. అయినా రైతులు వినలేదు. దీంతో పోలీసులతో కలిసి రైతులు భూముల వద్దకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక భూమి కోల్పోతున్న కాట్రేవుపల్లికి చెందిన రైతు వెంకటేశ్‌గౌడ్ పెట్రోల్ బాటిల్‌తో అధికారుల ముందుకొచ్చాడు. సర్వే పనులు నిలిపివేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. దీంతో తాసీల్దార్ సతీశ్‌కుమార్ చేసేదిలేక అధికారులతో సర్వేను నిలిపివేయించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ రైతులతో మాట్లాడుతూ.. కొడంగల్ ఎత్తి పోతల పథకంలో ఏ రైతు ఎంత భూమి కోల్పోతున్నారన్న విషయాన్ని పరిగణలోకి తీసుకునేందుకే సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఇది ఫైనల్ సర్వే కాదని సూచించినా ఎవరూ వినలేదు. దీంతో నీటిపారుదల, రెవెన్యూ అధికారులు సర్వే పనులు నిలిపివేశారు. రైతులు భారీగా తరలిరావడంతో ఏం చేయాలో తోచక అధికారులు తలలు పట్టుకున్నారు. చివరకు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్డీవో వద్దకు ఐదు మంది రైతులను తాసీల్దార్ తీసుకెళ్లాడు.

పెట్రోల్ బాటిల్ పట్టుకొని కూర్చున్న రైతు వెంకటేశ్‌గౌడ్

రెండెకరాలున్నా..

రైతుభరోసా రాలే..

- పెట్టుబడి సాయం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఆత్మకూర్ వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట మూడు గంటలపాటు కర్షకుల పడిగాపులు

అమరచింత, ఫిబ్రవరి 24: పంట పెట్టుబడి కోసం రైతుబంధు కింద గత ప్రభుత్వం చిన్న, పెద్ద తేడా తెలుండా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసేదని ఆత్మకూర్ మండలంలోని గుంటిపల్లి, దేవరపల్లి, మోట్లంపల్లికి చెందిన రైతులు మాసన్న, శ్రీనువాసులుతో పాటు పలువురు పేర్కొన్నారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమకు రెండెకరాల్లోపు భూములున్నా ఇప్పటివరకు రైతుభరోసా డబ్బులు తమ ఖాతాలో జమ కాలేదని దాదాపు మూడు గంటలపాటు ఆత్మకూర్ వ్యవసాయకార్యాలయం ఎదుట పడిగాపులు కాశారు. తమ గ్రామాల నుంచి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేక పోయినా తిప్పలు పడుతూ పది గంటలకు వస్తే.. 12గంటలైనా అధికారులు ఎవరు కార్యాలయంలో లేక పోకడంతో రైతులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికీ మూడు విడుతలుగా, ఎకరం, రెండు, మూడు, నాలుగు ఎకరాలంటూ విభజించి రైతు భరోసా నిధులను చేశామని ప్రభుత్వం చెప్పినా.. కేవలం రెండెకరాల భూమి ఉన్న తమకు ఇప్పటి వరకు రైతు భరోసా పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రైతు భరోసా ఎందుకు రాలేదో తెలుసుకుందామని వ్యవసాయకార్యాలయం చుట్టూ కాళ్లిగేలా తిరిగి వేసారుతున్నామని వాపోతున్నారు.

ఆత్మకూర్ ఏవో కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వివిధ గ్రామాల రైతులు

చూడాలని వుంది

- కార్మికుల జాడ కోసం కుటుంబాల ఎదురుచూపు
- నేడు దోమలపెంటకు రానున్న మూడు ఫ్యామిలీలు
- మా వాళ్లు బతికితే అప్పగించండి.. చనిపోతే శవాలైనా ఇప్పించాలని వేడుకోలు
- అన్న జాడ కోసం ఆందోళనలో జార్ఖండ్ వాసి

అన్న జాడ కోసం వచ్చిన జార్ఖండ్ వాసి అరుణ్

అచ్చంపేట, ఫిబ్రవరి 24: పేదరికంతో ఉన్న తమ కుటుంబాలకు ఆసరాగా ఉండి ఆదుకునేందుకు రాష్ట్ర సరిహద్దులు దాటి వచ్చిన జార్ఖండ్ కూలీల కుటుంబాలు తమ పిల్లల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్నారు. రోజూ ఫోన్‌లో యోగక్షేమాలు మాట్లాడుకునే కుటుంబ సభ్యులు తమ పిల్లలు, కుటుంబ సభ్యులు టన్నెల్‌లో చిక్కుకున్న సమాచారం అందుకున్న కుటుంబాలు పొరుగు రాష్ట్రం నుంచి కుటుంబ సభ్యుల జాడకోసం దోమలపెంటకు చేరుకుంటున్నాయి. అమ్రాబాద్ మండలం దోమలపెంటలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చోటుచేసుకున్న ప్రమాదంలో చిక్కుకున్న 8మంది కార్మికులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు చివరి చూపుకోసం ఎదురు చూస్తున్నారు. రెండు కుటుంబాలు దోమలపెంటకు వచ్చి ఆచూకీ లభించక పోవడంతో తిరిగి వెళ్లినట్లు సమాచారం. అయితే ఎనిమిదిమంది చిక్కుకున్నవారిలో అనూజ్ సాహూ (30) జార్ఖండ్ కార్మికుడు ఒకరు. ఆయనకు పెళ్లి కాలేదు. అనూజ్‌సాహూ తమ్ముడైన అరుణ్ సాహూ జార్ఖండ్ నుంచి అన్న ఆచూకీ కోసం సోమవారం దోమలపెంటకు వచ్చాడు. అరుణ్ సాహూను దోమలపెంటలో 'నమస్తే తెలంగాణ' పలకరించగా.. జార్ఖండ్ రాష్ట్రంలోని గుంలా జిల్లాలో చిన్నగ్రామం. ముగ్గురు అన్నదమ్ములం. తల్లిదండ్రులు వృద్ధులు. పెద్దన్న అనూజ్‌సాహూ మూడేళ్ల కిందట దోమలపెంటకు పనిచేసేందుకు వచ్చాడు. పనిచేసి ప్రతినెలా పంపించే డబ్బుతో కుటుంబం గడిచేది. అన్న టన్నెల్‌లో చిక్కుకుపోయి ఇక్కడున్న మా వాళ్లు ఫోన్‌చేసి చెబితే వచ్చా. ఇక్కడకు వచ్చి చూస్తే పరిస్థితి బాగా లేదని తెలిసింది. రేపు ఉదయం మానాన్న కూడా ఇక్కడికి చేరుకుంటాడు. మా అన్నను ఒక్కసారి చూడాలనుంది. తెలంగాణ సర్కారుకు మొక్కుతున్న. తొందరగా మా వాళ్లను తీయండి. బతికి ఉంటే అప్పగించండి.. చనిపోతే శవాన్ని ఇప్పించండి. మా ఊరికి తీసుకెళ్తామని వేడుకున్నాడు.

.. మిగిలిన ముగ్గురు జార్ఖండ్ కార్మికుల కుటుంబాలు కూడా సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకొని మంగళవారం దోమలపెంటకు చేరుకోనున్నాయి. చిక్కుకున్న 8మందిలో ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు మిషన్ డ్రైవర్లు, నలుగురు జార్ఖండ్ కార్మికులు ఉన్నారు. జార్ఖండ్ కార్మికుల్లో సందీప్‌సాహూ, జక్తాకేస్‌కు పెళ్లికాలేదు. సంతోష్‌సాహూకు వివాహమైంది. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంతోష్ కోసం బావమరిది, జక్తాకేస్ కార్మికుడి కోసం తమ్ముడు, సందీప్‌సాహూ కోసం తండ్రి వస్తున్నట్లు తోటి కార్మికులు తెలిపారు. లోపల చిక్కుకున్న వారి గురించి ప్రతిరోజూ వారి కుటుంబ సభ్యులు నిత్యం ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారని.. మేము ఏం చెప్పలేక పోతున్నామని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గంట గంటకు బయటకు వచ్చారా అంటూ అడుగుతున్నారని తెలిపారు. కుటుంబాలు వారి కోసం ఎదురు చూస్తున్నారని కార్మికులు తెలిపారు.

పేలిన టైర్ రేగిన మంటలు

- దగ్ధమైన ప్రైవేట్ ట్రావెల్ బస్సు
- తృటిలో తప్పించుకున్న ప్రయాణికులు
- మల్లెబోయిన్‌పల్లి శివారులో ఘటన

మంటల్లో కాలిపోతున్న బస్సు

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 24 : జాతీయ రహదారి-44పై ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు మంటలు అంటుకొని దగ్ధమైన సంఘటన జడ్చర్ల సమీపంలో చోటు చేసుకున్నది. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు సలీం ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఆదివారం రాత్రి బయలుదేరింది. సోమవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో భూత్పూరు మండల కేంద్రం దాటాక బస్సు వెనుక ఒక టైర్ పెద్ద శబ్దంతో పేలింది. అయినా డ్రైవర్ బస్సును అలాగే 5 కిలో మీటర్లు నడిపాడు. మల్లెబోయిన్‌పల్లి శివారులోకి రాగానే పేలిన టైర్ వద్ద మంటలు రావడాన్ని ప్రయాణికులు గమనించి డ్రైవర్‌కు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పెట్రోల్ బంక్ సమీపంలో నిలిపివేశాడు. అప్పటికే మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. అందులోని 38 మంది ప్రయాణికులు భయాందోళనతో బస్సులోంచి బయటకు పరుగులు పెట్టారు. మంటలు ఆర్పేందుకు ప్రయాణికులు చేసిన కృషి ఫలించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను ఆర్పారు. కానీ అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌స్వామి
- రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడి


వనపర్తి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 24 : స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌స్వామి డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థులతో కలిసి జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వని పరిస్థితి నెలకొందని.. దీంతో విద్యార్థులు చదివిన చదువుకు ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యతో ఉన్న తమ చదువులు చదివిన విద్యార్థులు కూలీ పనిచేసుకుంటూ కార్మికులుగా తయారవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలను చెల్లించాలని.. లేకుంటే రాబోయే రోజుల్లో క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలనే అంశాలపైన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నేతలు చిట్యాల రాము, లోకేశ్‌యాదవ్, చక్రి, షఫీ, బీచుపల్లి ముదిరాజ్, మహేశ్, రాకేశ్, నాగేంద్రం పాల్గొన్నారు.